# పతివ్రత



పై బెర్తు మీద హోల్డాల్ పరచుకుని పడుకున్నాడు పత్రికా సంపాదకుడు త్రివిక్రమరావు. కింద సీట్లో కూర్చుని ఇద్దరువిద్యార్థులు మాట్లాడుకుంటున్నారు

"అరెరె!" అన్నాడు మరో విద్యార్థి చేతిలో వున్న వార్తాపత్రిక మరింత శ్రద్ధగా చదువుకుంటూ.

"ఎవరేనా చచ్చేరా?" అంటూ పరామర్శించే ధోకతను

"ఊఁ"

"మన కాలేజీకి కలవిస్తారా?" సాలోచనగా అడిగేడు మరొకతను

"అకోరా చచ్చిపోయాడురా, పాపం!"

"ఎవడ్రా లకోరా!"

"మంచి రచయితరా"

"పేరలాగుందే! లోకరా లాగ"

"అకోరా అంటే అలమండ కోదండ రామయ్య."

"గండపెండేరం లాగుంది పేరు. అ.కో రా. అదే బాగుంది సింపుల్‌గా"

"ఆత్మహత్య చేసుకున్నాడుట."

"కవి అన్నవాడు చస్తేనే కాని గొప్పవాడు కాలేడు. అంచేత త్వరగా పేరు ప్రతిష్టలు సంపాదించే మార్గం చూసుకున్నాడన్న మాట."

బి. వి. రమణరావు




"చాలా గొప్ప రచయితరా. అతను రాసిన పుస్తకాలు చదవలేదూ! 'రక్తాగ్ని' 'బంగారు పంజరం' 'మబ్బు తెరలు;' నిరుడు యూనివర్సిటీ నాటక పోటీలలో ఫస్ట్ ప్రయిజ్ వచ్చిన నాటకం "తీరని దాహం" ఇతను రాసిందే.''

"జాతస్య మరణం ధృవం అన్నారు. చచ్చినవాడి గొడ వెందుకు కాని 'పెళ్ళి పందిర' సినీమా గురించి రివ్యూ ఏం రాశాడో చదువు"

త్రివిక్రమరావుకు యీ మాటలు వింటూంటే హృదయం ముళ్ళ కంపతో కెలికినట్టయింది. అకోరా రాసిన మాటల్లో వున్న సత్యం కళ్ళముందరే కనబడింది. తనకి అకోరా రాసిన వుత్తరం మళ్ళీ తీసి చదవడం మొదలెట్టేడు.

ప్రియమైన తికమకరావు,

ఈ కొంటె పేరుతో నిన్ను సంబోధించడం ఇదే ఆఖరిసారి. ఈ వుత్తరం నీ కందేటప్పటికి నా శవానికి అంత్య క్రియలు కూడా అయిపోతాయి. నిన్న రాత్రే ఈ నిర్ణయాని కొచ్చేను. ఉదయమే నాకున్న పాత ట్రంకు, పడక కుర్చి, బట్టలూ, పనికొస్తాయన్న నాకంటే దరిద్రుల కిచ్చేశాను. నువ్వు నా కథకి పారితోషికంగా పంపిన నూరు రూపాయలలోనూ అప్పులు పోగా ముప్ఫయి రూపాయిలు మిగిలేయి. అంత్య క్రియల నిమిత్తం పోలీసువాళ్ళ కది మిగిల్చేను.

నా మాటలు కర్కశంగానూ పైశాచికంగానూ కనబడుతున్నా యనుకుంటాను. ఆత్మహత్య చేసుకోడానికి నిర్ధారణ చేసుకున్నాక చావంటే భయం పోయింది అదీకాక నా జీవిత సమస్యల కింతకం పరిష్కార మార్గం కనబడలేదు.

దారిద్ర్యం, తీరని కోరికలూ, జీవితం వ్యర్థమనుకునే మానసిక ప్రవృత్తీ, వీటికి సాయం మూడు సంవత్సరాలుగా దిన దినాభివృద్ధి చెందుతున్న క్షయ రోగం — వీటన్నిటితో యిన్నాళ్ళూ శరీరం మీదుండే మమకారంతో పోరాడుతూ వచ్చేను. బాధపడతావని రోగం సంగతి నీకు చెప్పలేదు. ఇలాంటి నరకతుల్యమైన శరీర పంజరంలో బంధించి నా ప్రాణాన్నెంతకాలం బాధపెట్టమంటావు!

'పతితవ్రత' అనే నవల ఆరునెలల క్రితమే మొదలెట్టేను. దాన్ని ఎలా అంతం చెయ్యాలో ఇన్నాళ్ళూ తెలియ లేదు. దానికికూడా నిన్ననే సమాధానం దొరికింది. నిన్ననే పూర్తిచేశాను. దాని వ్రాతప్రతీ, ఇంకా కొన్ని గేయాలూ కథలూ ఒక కట్టకట్టి వుంచేను. వాటిని నీ కిమ్మని పోలీసువాళ్ళకి వ్రాశాను.

జన్మజన్మాలకీ నీకు కృతజ్ఞుణ్ణి. నువ్వు తప్ప నన్నుగురించి బాధపడేవాళ్ళులేరు. నా రచనలు మెచ్చుకున్న పాఠకులు 'అరె! పాపం! పోయేడా!' అని కొందరనుకుంటారు. 'కవి చస్తేకాని పైకి రాడు, కనక చావడమే మంచి'దని కొంద

రంటారు. అందరూ క్షణంలో మరిచిపో గలుగుతారు. నువ్వుకూడా సాధ్యమైనంత త్వరగా మరిచిపోడానికి ప్రయత్నించు.

విజయవాడ శాశ్వతముగా—నీ

ది.— అ.కో.రా

* * *

పోలీస్ సూపర్నెంట్ దగ్గిర శలవు తీసుకుని, కాగితాల కట్టతో అ.కో రా. గదిలోంచి బయట కొచ్చే టప్పటికి చినుకులు ప్రారంభించేయి. మెట్లు దిగబో తూంటే గుమ్మంలో ప్లిమత్ కారు ఆగింది. అందులోంచి దిగి బయటకి వచ్చిన వ్యక్తి నూతన సినీతార మాధవి. త్రివిక్రమరావు ఆశ్చర్యపోయేడు.

మా :- నమస్కారం.

త్రి :- నమస్కారం. ఏమిటిలా వచ్చేరు ?

మా - ఇదే మావూరు. ఇక్కడ నాకు బోలెడుమంది చుట్టాలూ, స్నేహి తులూ వున్నారు. హైద్రాబాద్ లో షూటింగ్ అయిపోగానే యిలా బయల్దేరి వచ్చేను. అకోరాగారి రచనలంటే నాకు చాలా యిష్టం. పేపరు చదివినప్పట్నుంచీ నా మనస్సు బాగాలేదు. ఏమిటో యీ 'మిష్టరీ' కనుక్కుందామని యిలా వొచ్చేను. మీ చేతులో ఏదో చాలా పెద్ద కాగితాలకట్ట వుందే!

త్రి :- ఏవో అతని వుత్తరాలూ, పుస్తకాలూ, ప్రచురణ కాని కొన్ని రచనలూ.

మా - ముందర కారెక్కండి. దార్లో మాట్లాడుకోవచ్చు.

ఎక్కడికి అని అడగనైనా లేదు. త్రివిక్రమరావు కార్లో కూర్చున్నాడు. కారు బయలుదేరింది.

మా - ఈ ఆత్మహత్యకి కారణం తెలిసిందా ?

త్రి - పోలీస్ సూపర్నెంట్ తో చాలా సేపు మాట్లాడేను. వాళ్ళకీ ఏమీ అంతుచిక్కలేదు.

మా :- మీ వుద్దేశ్యం ?

త్రి :- అకోరా నాకు రాసిన వుత్తరం యిది. ఇంచుమించు యిలాంటిదే పోలీస్ సూపర్నెంట్ కి రాశాడు. కాని యింత సామాన్య కారణంవల్ల విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేటంత పిరికివాడు కాదు. చాలా ప్రబలమైన కారణ మేదైనా వుండివుండాలి. అకోరా చాలా పట్టుద లైన మనిషి. అతని దారిద్ర్యం ఒక సాకు. డబ్బు సంపాదించలేనంత అసమర్థుడు కాదు నాలుగైదు సంవత్స[illegible]క్రితం ఉద్యోగం కావాలన్నాడు. ఈ [illegible]షయం తెలియగానే పేరుపడ్డ ఓ పత్రిక సంపా దకుణ్ణిగా వేసుకోడానికి అంగీకరించింది తీరా వుత్తరం రాసిందాకావుండి అవసరం లేదన్నాడు. తర్వాత ఆంధ్రప్రభుత్వం పంచవర్ష ప్రణాళిక పథకాల్ని తెలుగు లోకి తర్జుమా చెయ్యడానికి అతన్ని నియ మించింది. సంవత్సరంలో పూర్తిచెయ్య

వలసిన పని మూడునెలల్లో పూర్తిచేసి ఆ వుద్యోగానికి రాజీనామా యిచ్చేశాడు.

మా :— ఆయనకి క్షయ రోగమని మీక్కూడా తెలియదన్నమాట.

త్రి :— తెలిస్తే బలవంతంగానైనా వైద్యం చేయించేవాణ్ణి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒకరి సహాయం అర్థించని ఆత్మాభిమాని. డబ్బుని తృణప్రాయంగా చూసేవాడు. ఎక్కువ పంపిస్తే తిరగ్గొట్టేసేవాడు. తనదగ్గిర డబ్బుంటే అడగని వాళ్ళది పాపం. డబ్బులేకపోతే పస్తుంటాడు కాని ఎవర్నీ ఆశ్రయించలేడు.

మా :— అందుకే తన అంత్య క్రియలకి కావల్సిన డబ్బుకూడా ఉంచేసి మరీ చచ్చిపోయారు.

ఇంతవరకూ మాట్లాడుతున్న త్రివిక్రమరావు అకోరా యొక్క తీరనికోరిక ఏమిటా అని ఆలోచనలో పడ్డాడు అసలు అకోరాకి కోరికలుండటం సాధ్యమన్న విషయంకూడా అతని కెప్పుడూ తోచలేదు. అంత సంతృప్తిగా ఎప్పుడూ నవ్వుతూ జీవించేవాడు. సంఘాన్ని తన రచనలతో సంస్కరించడమే అతని ఆనందం, ఆదర్శం, లక్ష్యం అనుకునేవాడు. తను యిలా ఆలోచిస్తూంటే మాధవి అకోరా రచనలు పొగడుతూ వాటన్నింటినీ ఖరీదయిన పుస్తకాలుగా అచ్చువేయించమనీ, వాటికెంత ఖర్చయినా తను భరిస్తాననీ, అకోరా స్మారక నిధి ఏర్పాటుచేసి అతనిపేర పెద్దగ్రంథాలయం నెలకొల్పాలనీ చెప్పుకుంటూ పోతూంది.

కారు విజయవాడ పొలిమేర దాటి పదిమైళ్ళు వచ్చేసింది. వర్షంకూడా ఎక్కువయింది. అద్దాలు పైకెత్తేశారు. ముందుసీట్లో డ్రైవరూ మధ్యవయస్సులో వున్న ఒక పరిచారికా కూర్చున్నారు. వెనకసీట్లో త్రివిక్రమరావు, మాధవి ఉన్నారు

"మనం బందరు రోడ్డంట వెడుతున్నాం తెలుసా?" అన్నాడు త్రివిక్రమరావు రోడ్డువైపుచూసి.

"మిమ్మల్ని బందరు లేవదీసుకుపోవటం లేదులెండి. మరోనాలుగైదు మైళ్ళ దూరంలో రెస్టుహవుస్ వుంది. అందులో మకాం పెట్టేం."

"అదేం? మీదీవూరేగా బోలెడు బంధువులూ స్నేహితులూ వున్నారన్నారు.''

"అందుకే వూరు విడిచిపోవడం. నిన్నటినుంచి యింతవరకూ ఒక్కనిమిషం విశ్రాంతిలేదు. వెనక నా మొహం చూస్తేనే చీదరించుకునే చుట్టాలుకూడా ఎంతో ఆప్యాయంగా వాళ్ళింట్లో పనులు కూడా మానుకుని గంటల తరబడి వాళ్ళ కష్టసుఖాలు నాతో చెప్పుకోవడం, నేను చచ్చినట్టు వినడం, తోచినంత డబ్బు యివ్వడం. గొంతునెప్పెట్టేవరకూ విసుగూ విరామం లేకుండా ఈ సినీమా పరిశ్రమ గురించి వింతలూ, విశేషాలూ,

నా అనుభవాలూ చెప్పేవరకూ ఊరుకునే వారు కాదు. వచ్చి పద్దెనిమిది గంటలు కాకపోయినా పదిరోజులు విశ్రాంతి అవసరమయ్యేటంత గందరగోళంతో ఉక్కిరి బిక్కిరి చేసేశారనుకోండి.''

"మీరుచెప్పిన సంగతులువిని, పాపం, వాళ్ళూ ఉక్కిరి బిక్కిరయిపోయి వుంటారు. ఇంతకీ వాళ్ళెంతడబ్బు గుంజేరు?"

''ఇంతవరకూ పన్నెండు వేలు''

"బలవంతంగా కాదు కదా!"

''వాళ్ళు నామీద చూపెట్టే అభిమానం నటనని నాకుతెలుసు. నేనంటే ఎంత అసూయ పడతారో నాకుతెలుసు నా వెనక్కాల నన్నెంత నీచంగా ఎంచుతారో నాకుతెలుసు. అయినా వాళ్ళకి డబ్బిచ్చేను ఇంతకుముందూ యిచ్చేను. ఇకమీదటా యిస్తాను. ఇవ్వకేంచేస్తాను' నా అన్న వాళ్ళెవరూ లేరు నాకు.''

''తల్లి తండ్రులు"

"లేరు. మేనమామయింట్లో పెరిగేను మా అమ్మతాలూకు ఆస్తి అనుభవించటానికే నన్ను చేరదీశారు నాకు జ్ఞానమొచ్చినది మొదలు వాలా హీనంగా మాశారు. చుట్టుప్రక్కల వాళ్ళ మంచితనంవల్లా, లోకానికి వెరచి చదువు చెప్పించేరు. చదువుకుంటున్నన్నాళ్ళూ తిండికీ, గుడ్డకీ మొహం వాచేను పుస్తకాలు కూడా కొనిచ్చేవాళ్ళుకాదు నాకు పెళ్ళి అవసరమన్న విషయంకూడా



"శ్రమ తక్కువ. రంగూ తక్కువ!"

మరిచిపోయారు. చివరికి జీవితంలో ఒక్కతప్పటడుగు వేసేటప్పటికిక్షమించి ఆదరించిన వాళ్ళులేరు. ఇంట్లోంచి చావగొట్టి గెంటేశారు. అప్పుడు చచ్చేనో బతికేనో అక్కర్లేని నేను యిప్పుడు కులదేవతని వాళ్ళకి."

"మొత్తం మీద తంతే బూర్లెగంపలో పడ్డట్టు మిమ్మల్నింట్లోంచిగెంటెయ్యడమే మీకు మహోపకారంగా పరిణమించిందన్నమాట''

''ఒక్కొక్కప్పుడలాగే అనిపిస్తుంది."

బంగళాలో ఒకవాటాలో లైట్లు వెలిగివున్నాయి రెండోవాటా తలుపు మాధవి కూడా వచ్చిన దాసి తెరిచింది. హాలులో కుర్చీలు బల్లలూ ఒక క్రమపద్ధతిలో అమర్చివున్నాయి పక్కనున్నడైనింగ్ రూం బెడ్ రూంగామార్చేరు ముఖ్యంగా మెచ్చుకోతగ్గ దేమిటంటే, అల్లికపనుల

తోటీ, కర్టెన్లతోటీ, నగిషీ చెక్కిన పాత్రలతోటీ హాలు అలంకరించినపద్ధతి. మాధవిసౌందర్యారాధనని త్రివిక్రమరావు అభినందించకుండా ఉండలేకపోయాడు.

త్రి :- ఏమిటి! ఇవన్నీ మీరెక్కడికెడితే అక్కడికి కూడా పట్టుకెడుతూ వుంటారా !

మా - అన్నీ ఏమున్నాయి ! మంచి కర్టెన్సూ, టేబుల్ క్లాత్సూ లేకపోతేనాకు తోచదు ఈ ఫ్లవర్‌వాజు, అగరువత్తుల గొట్టం యిక్కడేకొన్నాను. ఈ కుషన్లన్నీ స్వహస్తాలతోనేను కుట్టుకున్న వే. వీటిని తీసుకు రావడానికి శ్రమేమీలేదు. కారు సీట్లో పడేసి తీసుకొచ్చినా తీసుకు రావచ్చు. కూర్చోండి యిప్పుడేవస్తాను.

మాధవి లోపలికెళ్ళిన తర్వాత, దాసీ మనిషి రామమ్మ తళతళ మెరిసే ప్లేట్లు పెట్లోంచి తీసి 'ట్రే'లలోసద్ది, వాటిలో బిస్కట్లు, వేయించిన జీడిపప్పు, మలబార్ బనానాచిప్స్, అంజూరాపళ్ళు, ద్రాక్షపళ్లూ బాదంపిస్తా మొదలయిన వన్నీ పెట్టి, తీసుగొచ్చి త్రివిక్రమరావు ముందర పెట్టింది. మళ్ళీవెళ్ళి 'ఐస్‌బాక్స్' తెరచి రెండు సోడాలుకొట్టి బల్లమీద పెట్టింది. ఇంతలో మాధవి తిరిగొచ్చింది. మాధవి చేతులోవున్న 'విస్కీబాటిల్' చూసే టప్పడికి త్రివిక్రమరావు విస్తుపోయాడు.

రెండుగ్లాసుల్లో విస్కీపోసి సోడాలతో నింపుతుంటే మాధవి ముఖంలో చిరునవ్వు తొణికిసలాడుతూంది. రెండు సంవత్సరాల క్రితం ప్రఖ్యాత సినీమా డైరెక్టర్ ప్రేమానంద్ గౌరవార్థం యిచ్చిన విందులో తనూ మాధవి కూడా 'విస్కీ' తీసుగోవడం జ్ఞాపకమొచ్చేక గాని మాధవి ప్రవర్తన త్రివిక్రమరావుకు అర్థంకాలేదు. ''శాసనోల్లంఘం మీ చేత కూడా చేయిస్తున్నందుకు క్షమించండి. వాతావరణం కూడా చాలా అనుకూలంగా వుంది తీసుకోండి మీ ప్రయాణబడలిక కూడా తగ్గుతుంది." మాధవి అందించిన గ్లాసందుకున్నాక ఇద్దరూ గ్లాసులు పైకెత్తి ఒకదానికొకటి తగిలించగానే "అకోరా గారి ఆత్మశాంతికి" అంది మాధవి.

త్రి - అకోరా అంటే మీకింత అభిమానముందని నాకుతెలీదు.

మా :- ఆయనదీ యీవూరేకదండీ. మాకాలేజీలోనే చదివేరు. అప్పట్నుంచీ ఆయన కథలన్నా నవలలన్నా నాటికలన్నా చెవికోసుకుంటాను. ఆయనరాసిన 'ఉన్మాదిని' అనే నాటకం మా కాలేజీలో ప్రదర్శించినప్పుడు అందులో నాయిక పాత్ర నేనే వేశాను.

త్రి - అయితే కాలేజీలో చదువుతున్నప్పట్నుంచీ వుందన్నమాట ఈ కళాభిమానం !

మాధవి తనగ్లాసు మళ్ళీనింపుకుంటూ "అదే నన్నీస్థితికి తీసుగొచ్చింది'' అంది. త్రివిక్రమరావు కూడా గ్లాసు ఖాళీ చెయ్యగానే అందులో కూడా విస్కీపోసింది. రామమ్మ సోడాకొట్టి గ్లాసు నింపింది.

త్రి - అదృష్టవంతులు. మీ అభిరుచులకీ ఆశయాలకీ తగ్గజీవితాన్ని సాధించేరు.

మా - నన్ను నిజంగా అభినందిస్తున్నారా ?

త్రి :- తప్పకుండా. కావల్సినంత డబ్బు, మీ కళోపాసనకి కావల్సిన అవకాశాలు, పేరుప్రతిష్టలూ. మీ జీవితం రోజూ పండగలా గుంటుంది.

మా - నా దైనిందిన జీవితంలో ఒక భాగమేవర్ణించేరు. వాటన్నిటిచాటునా వ్యక్తిగత జీవితంలో వున్న నైతిక పతనం మిగిలిన జీవితభాగాన్ని నరక తుల్యం చేస్తుంది.

త్రి - నైతిక జీవితం వ్యక్తి యొక్క మనోనిగ్రహంమీద ఆధారపడి వుంటుంది.

మాధవి మళ్ళీ గ్లాసు నింపుకుంది. త్రివిక్రమరావు తనకింకవద్దని వారించేడు. మాధవి ఒక పెద్ద గుక్క తాగి అంది "సాధారణ సంసారిక జీవితాల్లోకావచ్చు. కాని నా అనుభవం ఏమిటంటే నైతిక ప్రవర్తనకంటే నైతిక పతనానికే ఎక్కువ మనోనిగ్రహం కావాలి. మనస్సులోని కోరికలు చంపుకుని శరీరాన్ని స్వాధీనంలో వుంచుకోడం, జీవితంలో ఒకలక్ష్యం సాధించడంకోసం మనస్సుకు విరుద్ధంగా శరీరాన్ని త్యాగం చెయ్యడం, ఇందులో ఏదికష్టం? ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్ద సినీమాతార నవడానికి కారణం తెలుసా ?

త్రి :- మీ నటనా సామర్థ్య మనుకుంటాను.

మా :- కాదు.నాశరీర సౌందర్యం. అదే నాఆస్తి. అదే నా పెట్టుబడి. అదే నా ఆయుధం. ఈ ప్రొడ్యూసర్లనీ,డైరెక్టర్లనీ నాచిటికినవేలు చుట్టూతిప్పగలిగిన శక్తి యిచ్చినది నా నటనా, తెలివి, చదువూ కాదు. నా అందచందాలు. మొదట్లో నా కళాభిమానాన్ని నటనా నైపుణ్యాన్ని స్తుతి స్తారు. నా కార్యదీక్షని మెచ్చుకుంటారు. ఎగ్రిమెంట్ మీద సంతకమయిన మర్నాటినుంచీ నా వెనకబడి నా అందచందాల్ని పొగుడుతూ కామకళల్ని ప్రదర్శిస్తారు. అది వాళ్ల తప్పు కాదు. మానవ సహజమనుకుంటాను. నే నే విధమయిన త్యాగం చెయ్యక పోతే నా మీద వాళ్ళకెందుకంత అభిమానముంటుందీ ? నా శరీరం వాళ్ళ స్వాధీనంచేస్తే వాళ్ళు నన్ను తారని చేస్తారు. ఎన్నోరకాల పాత్రల నభినయిస్తూ పెద్ద సినీతార నవాలన్న నా లక్ష్యం ఎలాగ సాధించడం? అడుగడుగునా ఇదే సమస్య ఎదురయింది. పద్దెనిమిదేళ్ళు తీరని కోరికలతో గర్భదరిద్ర మనుభవించేను. మళ్ళీ ఆ జీవితంలోకి వెళ్ళదలుచుకోలేదు. చేతికందిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించు కున్నాను. ఈ నాటికి పెద్ద సినీతారవనిపించు కుంటు

న్నాను. కాని సుఖపడటానికి నోచుకో లేదు.

త్రి - మీకేంలోటు?

మాధవిచేత్తో సౌజ్ఞచేసింది రావమ్మ మరో సోడాకొట్టి పట్టుగొచ్చింది మాధవి గ్లాసులో పోసుకుంటున్న విస్కీ చూసి త్రివిక్రమరావు ఆశ్చర్యపోయేడు రాను రాను సోడాకంటే విస్కీ ఎక్కువవు తుంది గ్లాసులో అప్పటికే మాధవి చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి చిరుచెమటలు కూడా ప్రారంభించేయి. పచ్చటి పసిడి ఛాయతోటి, నాజూకైన శరీరంతోటీ తీర్చి దిద్దిన ముఖలక్షణాలతోటీ సజీవ మైన అజంతా శిల్పమా అనిపిస్తుంది మాధవి ముందుకు వంగి గ్లాసు అందు కునే ప్రయత్నంలో వుండగా బుజంమీద వున్న జరీ జార్జెట్ పవిట జలజలమని ముంజేతి గాజుల వరకూ జారింది పవిట సద్దుకోడానికి కూడా మళ్ళీ ప్రయత్నించ లేదు. మంత్రముగ్ధుడులాగ ఆ ముగ్ధ సౌందర్యాన్నిచూస్తున్న త్రివిక్రమరావు "నేనూ మీఆవిడా ఒకళ్ళజీవితాలు ఒకళ్ళు మార్చుకుందామని వుంది మీ ఆవిడ ఒప్పుగుంటుందా?" అన్న మాధవి మాటలతో వెన్నుమీద చరచి నట్లయి చైతన్యంలోకి వచ్చేడు జవాబు చెప్పలేక తికమకపడ్డాడు

"మాట్లాడరేం? నాకేంలోటు అని అడిగేరే' నా ప్రశ్నకి సమాధానం చెప్పండి హూ. నేచెబుతా వినండి మీ ఆవిడ ఒప్పుకోదు కారణం తెలుసా? స్త్రీలను గురించి ప్రబంధాలు రాయమంటే రాస్తారు పురుషులు కాని స్త్రీయొక్క జీవిత పరమావధిఏమిటో తెలుసుకోలేరు మాతృత్వం' ప్రతి స్త్రీ ఒకతల్లి బాల్యం నుంచీ పసిపాపల్ని ప్రాణప్రదంగా లాలి స్తుంది రోగంతో నిస్సహాయంగా వున్న వాళ్ళకి ఆదరణతో సహనంతో, పరిచర్య చేస్తుంది ఆ ప్రేమ, ఆ సహనం మాతృ త్వం యొక్క ప్రతిబింబాలు పెళ్ళికాగానే భర్తని బిడ్డలా చూసుకుంటుంది సంతా నం కలుగగానే మాతృత్వం పరిపూర్ణత చెంది భర్తని, బిడ్డల్ని హృదయంలో ఇముడ్చుకుని ప్రేమిస్తుంది వాళ్ళసుఖ దుఃఖాలు పంచుకుంటూ వాళ్ళ సౌఖ్యం కోసం ఎలాంటి త్యాగాన్నయినా చేస్తుంది అలాంటి మాతృత్వానికి నోచు కోని స్త్రీ జీవితం ఎందుకు? నాకేం లోటు అని అడిగేరు నేనెవరికోసం జీవిస్తు న్నాను? ఎవరికోసం ఈ డబ్బు? నేనెవరికి కావాలి? నా ఘోష ఎవరువింటారు?"

మాధవి కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి మొహం ఎర్రబడింది ప్రయత్నపూర్వ కంగా ఆవేదనని అణచుకొని ఏదో నిశ్చ యాని కొచ్చినట్టు కళ్ళుతుడుచుకుని విస్కీ సీసామూత తియ్యబోతూవుంటే రావమ్మ లాగేసింది, "రావమ్మా......కొంచెం పొయ్యి .నీ చేత్తో నువ్వే పొయ్యి .. ప్లీజ్" అంటూ ప్రాధేయపడుతూ అడి



"విమానం ఎక్కితే మీకు భయం వెయ్యలా?"
"ఏం భయం, అక్కడ ఎక్కగానే కళ్ళు గట్టిగా మూసుకున్నా, విమానం ఇక్కడ దిగగానే కళ్ళు తెరిచా."

గింది. మాధవి పరిస్థితి స్మృతిమించినట్లు గ్రహించాడు త్రివిక్రమరావు

త్రి చూడండి, మీరీ త్రాగుడు వ్యసనం మానెయ్యాలి

మా లాభంలేదు కష్టాల్ని మరచి సుఖాన్నిచ్చే దివ్యౌషధం యిది అసభ్యతలో కూడా సభ్యతను చూపెట్టే ప్రియదర్శిని యీ విస్కీ. అవసరమైతే విచక్షణా విహీనమైనపశువుగా మార్చగలఅమృతం యిది. నాకు తోడునీడగావుంటూ, సానుభూతితో నా కష్టసుఖాలను పంచుకునే పరమ మిత్రుడిది దీన్ని దూరం చెయ్యకండి త్రివిక్రమరావుగారూ, రావమ్మతో చెప్పండి ఇంకొంచెం యిమ్మనండి మళ్ళీ అడగను.

రావమ్మ మాధవినింక మాట్లాడించవద్దనీ, యింక త్రాగనివ్వకూడదనీ సౌజ్ఞ చేసింది మాధవి కూనిదీర్ఘాలు తియ్యడం మొదలెట్టింది త్రివిక్రమరావు లేచేటప్పటికి మాధవి అతని చెయ్యి పట్టుకుని "ఇంకొంచెం యిమ్మనండి మీకేమి కావలిస్తే అదిస్తాను ఈ ఉపకారం చెయ్యండి, కనికరించండి" అంటూ దీనంగా బ్రతిమాలింది అతను లేచివచ్చి మాధవి బుజంమీద చెయ్యివేసి 'ఏమిటిలాగ... చంటిపిల్లలాగ " అంటూ బుజ్జగించి వారించడానికి ప్రయత్నించిన కొద్దీ మాధవి ఉద్రేకం రెచ్చిపోయింది అతని చేతులు తనచేతులతో పెనవేస్తూ "మీరు మీ చేత్తోనే కొంచెం యివ్వండి లేకపోతే నేను బతకను..." అనేసి నిస్పృహతో మొహం చేతుల్తో కప్పుకుని ఏడవటం ఆరంభించింది అతనికి దృశ్యం దుర్భరంగా కనపడింది. రావమ్మతో మరోసోడా కొట్టమని తనే గ్లాసులో విస్కీ కలిపి యిచ్చేడు

రెండు గుక్కలు తాగి "థేంక్యూ టివికర్రమావు గుడ్ బోయ్...థేంక్యూ రావమ్మా...బంగారు బొమ్మా...ఇదిగో చూడు ఆ మిగిలింది డ్రైవరుకిచ్చెయ్యి... నువ్వు రోజూ వాడికి దొంగతనంగా యిస్తున్నావు...నాకు తెలుసు...వెళ్ళు ..ఈయన యిక్కడే వుంటారు నాకు సాయం డైరెక్టర్‌తో చెప్పుగో...నాకేం భయమా... ,గుడ్ నైట్....బై బై. టా టా..." అంటూ తడబడేమాటలు వివిధ స్వరాలతో దీర్ఘాలు తీస్తూ లేచి

నిలబడే ప్రయత్నంలో తడబడే అడుగులతో త్రివిక్రమరావు చేతుల్లో వాలిపోయింది రావమ్మ వెకిలిగా కనుసౌజ్ఞ చేసి విస్కీసీసా చీరచెంగు చాటున దాచుకుని వరండామీదికెళ్ళి బయటనుంచి గడియవేసింది

*        *        *

కిటికీ అద్దాల్లోంచి సూర్యకిరణాలు మొహంమీదపడేవరకూ మర్నాటి ఉదయం మెళకువరాలేదు త్రివిక్రమరావుకు. తలగడామీద, పక్కమీద వాడిపోయి వున్న పువ్వులు తన రాత్రి అనుభవం కల కాదని రుజువుచేశాయి లేచి హాల్లోకి వచ్చేడు. మాధవి జాడకాని రావమ్మజాడకాని, ఆ అలంకరణ సామగ్రి కాని కనబడలేదు. బంగళా 'వాచ్ మేన్'ని పిలిచి అడిగేడు

"కోడి కూయకముందే పక్కవాటాలోవున్న సినిమా డైరెక్టర్‌గారూ యీళ్ళూ కలిసి కార్లో ఎళ్ళిపోయారు బాబూ"

"పక్క భాగంలోనా !"

"అవునుబాబూ, అందరూ కలిసే దిగేరు. పగలంతా కలిసేవున్నారు"

రిజిస్టర్ తెప్పించి చూశాడు డైరెక్టర్ మురళీకృష్ణ పేరుంది ఇక అడగవల్సిందేమీ కనబడలేదు రాత్రి మత్తులో మాధవి "డైరెక్టర్‌గారితో చెప్పుకో...నాకేం భయమా !" అన్న మాటల్లో అంతరార్థం యిప్పుడు బోధపడింది బోధపడనిదల్లా మాధవి ప్రవర్తన తనని వెతుక్కుంటూవచ్చి బలవంతంగా యిక్కడికి తీసుగొచ్చి యింత నాటకమాడవల్సిన అవసరం ఏమిటి ! ఇంత తక్కువ పరిచయమున్న తనకు యింత చనువిచ్చి, ఆత్మాభిమానాన్ని చంపుకుని ఒకరాత్రి శరీరాన్నర్పించి మాధవి సాధించిన ఘనకార్యమేమిటి ! మద్రాస్ తిరిగి వెళ్ళేక మాధవిని కలుసుకుని సంజాయిషీ అడగాలి అని నిర్ణయించుకుని కాలకృత్యాలకుపక్రమించేడు

*        *        *

త్రివిక్రమరావు మద్రాస్ తిరిగివచ్చేక తన పత్రికా కార్యాలయంలో కూర్చుని, అకోరా రాసిన 'పతిత వ్రత' అనే నవల వ్రాతప్రతి కాగితాలు సంఖ్యా క్రమంలో సద్దడానికుపక్రమించేడు అకోరాకి కూడా చాలా కవులకుండే వ్యాధేవుంది. దస్తూరి బాగుండకపోవడం, చాలాచోట్ల కొట్టివేతలూ మార్పులూ వున్నాయి. మధ్యలో ఒక అధ్యాయం కొట్టివేతలు లేకుండా చాలా సాఫీగావుంది, అదేదో ఉద్రేకంలో రాసి వుంటాడని గ్రహించి దాన్ని చదవడం మొదలెట్టేడు అందులో యిలా వుంది —

రాత్రి తొమ్మిదిగంట లయింది చలిగాలికితోడు వర్షం చినుకులు కూడా ప్రారంభించేయి చంద్రశేఖరం తన గదిలో పడక కుర్చీలో పడుకుని రాధ

రాసిన ఆ చిన్న వుత్తరాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు కిటికీలోంచి వర్షం తుంపర్లు మీద పడుతున్నాయి. హృదయంలో ప్రజ్వరిల్లుతున్న విరహాగ్ని కొంతవరకైనా చల్లారుతుందని కిటికీ తలుపులు ముయ్యలేదు జేబులోంచి ఆ చీటీ తీసి మళ్ళీ చదివేడు

"దయుంచి నన్ను యిక మీదట కల్సుకోటానికి ప్రయత్నించకండి వీలువెంబడిని విపులంగా రాస్తాను"

రాధ,

చంద్రశేఖరం మెడికల్ కాలేజీ విద్యార్థి అందమైన వాడు, చురుకైన వాడు, తెలివైన వాడు అతను వుంటున్న వీధిచివర చిన్నయింట్లో రాధ వుంటుంది. విచిత్రమైన సంఘటన రీత్యా అతనికి రాధతో పరిచయమయింది రాధకి సినీమాలు చూడటం తగని పిచ్చి తరచు సాయింత్రం ఏదో సినీమాకు వెడుతూ వుంటుంది. ఓ రోజున సినీమానుంచి వంటరిగా తిరిగి వస్తూండగా రౌడీ మూక వెంటబడి అల్లరి చేస్తూంటే వాళ్ళ బారి నుండి రక్షించి, మర్నాడు తన స్నేహితుడయిన పోలీస్ ఇన్‌స్పెక్టరుతో చెప్పి వాళ్ళకి బుద్ధిచెప్పించేడు చంద్రశేఖరం అలా మొదట పరిచయ మయింది తర్వాత ప్రయత్న పూర్వకంగా సినీమా హాలు దగ్గిర కలుసుకుని తనే టిక్కట్లు కొని రాధని తరచు సినీమాలకి తీసు వెళ్ళడం మొదలెట్టేడు ఈ పరమార్థంలోని అంతరార్థాన్ని గ్రహించికూడా, రాధ ఈ వంటరి జీవితంలో వున్న ఈ కాస్త ఆనందాన్ని చేతులారా విడిచిపెట్టలేక అతని స్నేహాన్ని తృణీకరించలేక పోయింది రానురాను రాధ యింటికి వెడుతూ వుండటం, యోగక్షేమాలు కనుక్కుంటూ అవసరం లేకపోయినా సహాయం చేయడం చంద్రశేఖరానికి అలవాటయింది స్త్రీ స్నేహాన్ని ఏ ఆశతో పురుషుడు అర్థిస్తాడో గ్రహించలేని అవివేకి కాదు రాధ. సమాజం దృష్టిలో తను పతిత దారీతెన్నూలేని తన జీవితాన్ని పునరుద్ధరణ చేస్తానని త[illegible]చుకోటానికి తనక్కడ ఏర్పాట్లుచేసి రెండు మూడు నెలల్లో ఉద్యోగం సంపాదించి యిక్కడికొచ్చి తన్ను పెళ్ళాడతానని వాగ్దానం చేసిన మహాత్యాగి రెండు నెల లయింది హైద్రబాద్ వెళ్ళి. ఉద్యోగం దొరికినట్లు లేదు ఏదో ఆవేశంలో చేసిన వాగ్దానాన్ని పురస్కరించుకుని కలుషితమైన తన శీలాన్నీ భారాన్నీ ఆ అమాయకుని మీద పెయ్యడం రాధ కిష్టం లేదు గత జీవిత మొక భయంకర దుస్స్వప్నం. భవిష్యత్తు సందేహాస్పదం వర్తమాన జీవితంలో చంద్రశేఖర మొక ముఖ్యమయిన భాగమై పోయాడు క్రమంగా వారి స్నేహం ప్రణయంగా పరిణమించింది చంద్రశేఖరం తనపై చూపే ఆదరాభిమానాలకి కృతజ్ఞత తెలియజేసే మార్గం మరొకటి లేనందున అతని కామతృష్ణకి తన

శరీరాన్ని సంతోషంగా అర్పించింది ఒక సారి కాలుజారిన స్త్రీకి రెండోసారి అంత బాధనిపించదు.

చంద్రశేఖరం రాధ రాసిన ఉత్తరం గురించి మళ్ళీ ఆలోచించటం మొదలెట్టేడు ఎందుచేత యిలా రాసింది ? రాధ మేనమామ రాధకోసం వెతుకుతున్నాడని తెలిసింది అతను కాని వచ్చేడేమో ! అతనంటే రాధకి భయం భయపెట్టో కొట్టో యింటికి తీసుకుపోతాడు కూడాను ఇంతలో తలుపు చప్పుడు అతని ఆలోచనలకి అంతరాయం కలిగించింది. తలుపు తెరిచేడు.

ఆగంతకుడి వయస్సు సుమారు ముప్ఫయ్యేళ్ళుంటాయి చామన ఛాయ. విశాలమైన నుదురు రేగినజుట్టూ, అందమైన విగ్రహం కాకపోయినా ఏదోవింత ఆకర్షణ కనబడుతుంది వర్షం తుంపర్లకు తడిసిన లాల్చీ పైజమాలు దులుపుకుని చేతిరుమాలుతో మొహం తుడుచుకుంటూ "చంద్రంగా రంటే మీరేననుకుంటాను" అన్నాడు

"నాపేరు చంద్రశేఖరం."

"మీతో కొంచెం మాట్లాడాలని వచ్చేను."

''కూర్చోండి "

"థేంక్స్ రాధ చరిత్ర మీకు చాలా భాగం తెలిసే వుంటుంది ''

"ఏ రాధ ''

"ఈ వీధి చివరనున్న అమ్మాయి.''

''నా కెవరూ తెలీదు.''

"మీకూ రాధకివున్న స్నేహం నాకు తెలుసు ''

''ఎందు కొచ్చేరిక్కడికి మీరు ''

"రాధకి అన్యాయం జరగకుండా చూద్దామని.''

"నా కే అమ్మాయితో టీ ఎలాటి సంబంధం లేదని చెప్పేను ''

"కోపం తెచ్చుకోకండి మీ యిద్దరి స్నేహానురాగాలూ క్షణంలో రుజువు చెయ్యగలను "

''మీకెందు కంత శ్రమ !''

"మీతో వాదించడానికి కాని, నిందించడానికి కాని నేను రాలేదు ''

''సలహా యివ్వడాని కొచ్చేరా ! నా కవసరం లేదు ''

"మీ సహాయం కోసం వచ్చేను ''

''ఏమిటది ?''

''రాధని మీరు పెళ్ళాడ దలచుకున్నారా ?"

''రాధేమిటి, నేను పెళ్ళాడట మేమిటి !''

''ఇవి మీరు రాధకి రాసిన ఉత్తరాలే కదూ ?"

''అవి మీ కెక్కడివి ?"

"ఇప్పుడైనా సమాధానం చెబుతారా?"

"నేను పెళ్ళాడను. పెళ్ళాడతానని వాగ్దానం కూడా చెయ్యలేదు ఆ ఉత్తరాలతో నన్ను వంచించ దలచుకున్నారా ?"

"కాదని ముందే చెప్పేను."

"ఆల్ రైట్. ఆ వుత్తరాలు నేను రాసినవే. అవి నా కిచ్చెయ్యండి. మీ కెంత డబ్బు కావాలో చెప్పండి యిస్తాను."

"క్షమించాలి. నేను కోరే సహాయం డబ్బు కాదు."

"అయితే ఆ వుత్తరాలు నా కెందు కిచ్చెయ్యకూడదూ?".

"చూడండి. వీటిని రాధ చాలా రహస్యంగా దాచుకుంది, కాని ప్రమాదవశాత్తూ నా చేతికి చిక్కేయి. అవి చదివి పరిస్థితి గ్రహించేను. రాధకి తెలియకుండా ఇక్కడికి తెచ్చేను."

"అవి ఏం చేస్తారు?"


"ఎక్కడనుంచి తెచ్చేనో అక్కడే రహస్యంగా పెట్టేస్తాను"

"అయితే నే చేసే సహాయమేమిటి?"

"రాధ జీవితాన్ని సంస్కరించడం"

"నన్నేం చెయ్యమంటారు"

"మీరు రాధకో వుత్తరం రాయండి. గతం మరిచిపొమ్మనీ, జీవితం చేతులారా



నాశనం చేసుకోవద్దనీ, ఇకమీదటనైనా నీతిగా జీవిస్తే బాగుపడే అవకాశం ఉండకపోదనీ"

"మీరే ఎందుకు చెప్పకూడదూ ?"

"నేనిప్పుడు నీతులు చెప్పే స్థితిలో లేను. చెబితే శత్రువు నవుతాను. మీ రీ క్షణంలో రాధకి ఆప్తమిత్రులు. నిశ్చల హృదయంతో సలహా యిస్తే పశ్చాత్తాపంతో పునీత అవుతుంది. ఒక అభాగ్య స్త్రీని సన్మార్గంలో పెట్టడానికీపాటి త్యాగం చెయ్యగలరనే నమ్మకంతో వచ్చేను. ఆవేశంలో మీరుచేసిన తప్పు కూడా సరిదిద్దుకున్నవా రవుతారు."

"రాధ జీవితం బాగుపడుతుందని మీకు నమ్మకముంటే తప్పకుండా ఇప్పుడే వుత్తరం రాసి పంపిస్తానని వాగ్దానం చేస్తున్నాను."

"నమ్మకముంది. రాధ కింకా ప్రపంచానుభవం తక్కువ. ఉద్రేకం ఎక్కువ. కోరికలనే దాహంతో సెలయేరులనుకుని ఎండమావుల్ని వెంటాడుతుంది. ఇప్పటికి రెండు తప్పటడుగులు వేసింది. ఇప్పుడైనా మించిపోయిందిలేదు. ఇక మీదటయినా నీతినియమాలకు కట్టుబడి వుంటే పెళ్ళి చేసుకుని సుఖపడే అవకాశం లేకపోలేదు. ఆరంగుళాల వెడల్పు ఎనిమిదంగుళాల పొడుగూ వుండే మొహంమీద వున్న చర్మం యొక్క ఆకారం కాదు మనిషి విలువ కట్టడానికాధారం. ఆకారంలేని మనస్సు ప్రధానం. ఈ విషయాలు విపులంగా రాయండి. తర్వాత తన భవిష్యత్తుకు తనే బాధ్యురాలవుతుంది."

"తప్పకుండా రాస్తాను"

"ఆ నమ్మకంతోనే యిక్కడికి వచ్చేను. శలవు."

"మీరెవరో చెప్పలేదు"

"రాధకి కాబోయే భర్తని."

* * *

త్రివిక్రమరావు సాయంత్రం మాధవి ఇంటికి వెళ్ళి కనుక్కుంటే డైరెక్టర్ మురళీకృష్ణతో కలసి ఆ ఉదయమే తిరుపతి వెళ్ళినట్టు తెలిసింది. తిరిగి వచ్చేసే ప్రయత్నంలో బస్‌స్టాప్ దగ్గిర బస్‌కోసం నిరీక్షిస్తుండగా అతని దృష్టి అప్రయత్నంగా పక్కనే నిలబడి శ్రద్ధగా చదువుతున్న విద్యార్థి చేతిలో 'సినీలోకం' మీద పడింది. ముందర పేజీలో పెద్దక్షరాలతో 'మాధవి డాక్టర్ శేఖర్ల కామ లీలలు' అని వుంది. తక్షణం ఎదురుగా వున్న కిళ్ళీ దుకాణం దగ్గిరకు వెళ్ళి ఆ పత్రిక కొని ఆ ముందర పేజీలో భాగం గబగబ చదివి పత్రిక మడచి జేబులో పెట్టుకున్నాడు. అందులోవున్న సారాంశం యిది — గతరాత్రి పదిగంటలకి హార్బర్ లెవెల్ క్రాసింగ్ దగ్గిరకి ఒంటరిగా వాయువేగ మనోవేగాలతో కారు డ్రైవ్‌చేస్తూ మాధవి తనకోసం రావడం చూసిన డాక్టర్ శేఖర్ ప్రజలు చూస్తున్నారనైనా అభిమానం లేకుండా

మాధవి కారెక్కి తను డ్రైవ్ చేస్తూ తీసుకుపోయాడుట – ఆ సంఘటనని లైలామజ్నూ ఆఖరి ఘట్టంతో పోల్చి, చిలవలు పలవలతో సింగారించి, శృంగార రసంతో చిలికి ప్రజారంజకంగా అంద జేసిం దా పత్రికారాజము.

డాక్టర్ శేఖర్ త్రివిక్రమరావుకు బాల్యస్నేహితుడు. శేఖర్ ప్రణయ దండయాత్రలు ఇతనికి కొత్తకాదు. అయినా ఇందులో ఎంత సత్యముందో తెలుసుకుందా మన్న కుతూహలంతో తిన్నగా శేఖర్ యింటికి కాళ్ళు మళ్ళించేడు.

డాక్టర్ శేఖర్ చురుకైనవాడూ, తెలివైనవాడూ. దానికి సాయం అందర్నీ ఆకర్షించే అందమయిన విగ్రహం. దానా దీనా ప్రాక్టీస్ పెట్టి మూడేళ్ళే అయినా మంచి పేరూ డబ్బూ సంపాదించేడు. త్రివిక్రమరావు వెళ్ళేటప్పటికి శేఖర్ బయటకెళ్ళడాని కాయత్తమౌతున్నాడు.

"ఏరోయ్! ఏమిటి రోగం యిలా వొచ్చేవు"

"నీ రోగం కుదర్చటానికే వచ్చేను"

"ఏమిటి కథ?"

"మీ ఆవిడ యింట్లో వుందా?"

"ఆహా పిలవమంటావా?"

"పిల్చి యీ పత్రిక నా అభివందనాలతో ఇయ్యి."

"ఎవడ్రా యీ చెత్త రచయితా! మైగాడ్! ఓరి పీడి శృంగార సాహిత్యం తగలెయ్యా! ఈ దెబ్బతో మాధవి పని



జ్యోతిష్యం చెప్పబడును. 3 ప్రశ్నలకు ఒక రూపాయి మాత్రమే!
నా మూడో ప్రశ్న ఏమిటంటే!.. మీకివ్వవలసిన ఒక రూపాయి నేను యిస్తానో, యివ్వనో చెప్పండి!

---

క్లోజ్. దీన్ని జాగ్రత్తగా జేబులో పెట్టుకో."

"ఎందుకూ! యిక్కడే పారేస్తాను."

"ఏడిశావ్! పారెయ్య దల్చుకుంటే నాలుగైదు వీధులు దాటిన తర్వాత పారెయ్యి. పద అలా పోదాం"

కార్లో వెడుతూంటే శేఖర్ చెప్పడం ప్రారంభించేడు. "నిన్ననేం జరిగిందో తెలుసా! రాత్రి పదిగంటలకి హార్బర్ ఇంజనీరింట్లో సీరియస్ కేసుంటే అది చూసి వాళ్ళ కార్లోనే తిరిగొస్తున్నాను. లెవెల్ క్రాసింగ్ దగ్గిర గేట్ వేసేశారు. ఎదురుగుండా బ్రహ్మాండమైన స్పీడులో చెవులు బద్దలయ్యేలాగ డబుల్ హారన్ మోగిస్తూ కారొస్తూంది. ఆ స్పీడ్లో అక్కడున్న వాళ్ళని పచ్చడిచేసి గేటుకు గుద్దేసి ఏదో ప్రమాదం జరుగుతుం దనుకున్నాను. హడిలిపోయి అందరూ

పక్కకి తప్పుకున్నారు. సడన్ బ్రేక్ వెయ్యడం మూలాన్ని టైర్లు కీచుమంటూ శబ్దంచేసి కారు అడ్డంతిరిగి ఆగిపోయింది. మాధవి మొహం ఆనవాలుకట్టి లెవెల్ క్రాసింగ్ దాటి ఆ కారుదగ్గర కెళ్ళేను. అప్పటికప్పుడే మాధవిని అందరూ తలో మాట అంటున్నారు. జనం చుట్టూ మూగేరు, మాధవి మొహంలోకి చూసే టప్పటికి నాకే భయం వేసింది. కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా గున్నాయి. మొహంకూడా ఉబ్బింది. ఆ లక్షణాలని పట్టి తప్పతాగిందని గ్రహించి స్టీరింగ్ వెనకాల్నించి మాధవిని పక్కకు నెట్టి డ్రైవ్ చెయ్యడానికి కూర్చున్నాను. మాధవి నన్నుచూసి బావురు మంటూ ఏడ్చి నా బుజంమీద వాలింది. అక్కడ నుంచి యింటికి తీసుగొచ్చి దిగపెట్టేను. ఒక గంట పోయిన తర్వాత డైరెక్టర్ మురళీకృష్ణ అక్కడికొచ్చేడు. మాధవి మానసిక పరిస్థితి బాగాలేదు, మనశ్శాంతి విశ్రాంతి కావాలని చెప్పి వాళ్ళిద్దర్నీ ఇవ్వాళ ఉదయమే తిరపతి వెళ్లమన్నాను వెళ్ళేవుంటారు.''

త్రి :- ఎందుకలా డ్రైవ్ చేస్తుందో కనుక్కోలేదూ ?

శే :- దేనికోదానికి గుద్దేసి చచ్చిపోదామని.

త్రి :- అంత ఆత్మహత్య చేసుకోవల్సిన పరిస్థతి ఏమొచ్చింది !

శే :- మాధవికిది మొదటిసారి కాదు. అసలు చాలా ఉద్రేక స్వభావంకల మనిషి. ఈ సినీమాల్లో చేరకముందు పోసారి క్రిష్ణానదిలో పడి చావటానికి విజయవాడలో ప్రయత్నించింది.

త్రి : ఏం!


శే : డైరెక్టర్ మురళీకృష్ణది విజయవాడే. ఐదేళ్ళక్రితం ఇప్పుడున్నంత పేరులేదు వాడికి. మాధవి వాళ్ళ కాలేజీ వార్షికోత్సవాలకి డ్రామాలో నటించిందిట. అదిచూసి మురళి మాధవిని బుక్ చేసి నెల్లాళ్ళకూడా తిప్పుకున్నాడు. ఈలోగా వాడు డైరెక్ట్ చేద్దామనుకున్న ఫిల్మ్ తాలూకు ప్రొడ్యూసర్లు చల్లగా జారుకున్నారు. దానితో మళ్ళీ నెల్లాళ్ళలో వచ్చి తీసుగెడతానని చెప్పి మాధవిని విజయవాడలో దిగపెట్టేడుట. మాధవి యింటికిరాగానే వాళ్ళ వాళ్ళు దగ్గిరున్న డబ్బు లాక్కొని ఒళ్ళు వాచేలాగ తన్ని ఇంట్లోంచి బయటకి గెంటేసేరుట. ఆ వేడిమీద క్రిష్ణలో దూకేద్దామని రాత్రి పరిగెడితే, అక్కడ పనీపాటూలేని నీబోటి భావకవి చక్రం అడ్డువేసి రక్షించేడుట.

త్రి:- ఇదందా నీకేలా తెలుసు ?

శే :- మాధవే చెప్పింది.

త్రి :- నీ కెన్నాళ్ళనుంచి మాధవితో పరిచయముంది ?

శే :- ఆ రక్షించిన భావకవి మాధవిని తిన్నగా మద్రాస్ తీసుగొచ్చి జార్జ్



"అయ్యా! డాక్టరుగారూ, నా ఒంట్లో జబ్బేమీ లేదుగానీండి, బయటకు వెళ్లాలంటే పట్టుమని పది అడుగులైనా వెయ్యలేకుండా వున్నాను. ఏం చేయాలో దయచేసి చెప్తారా?"
"ఓ దానికేముంది రిక్షా మాట్లాడుకుంటే సరి "

టౌనులో ఓ వీధి చివర యింటిభాగంలో దింపేడు. సరిగ్గా ఆ వీధిలోనే ఒక గదిలో ఆ సమయంలో విద్యార్థిగా నేను వుండటం విధి విలాసం! తద్వారా మా పరిచయం ఈశ్వర సంకల్పం!

త్రి - కిక్కురుమనకుండా వాడితో లేచి వచ్చేసిందన్నమాట.

శే - వాళ్ళిద్దరకీ కొంత పరిచయ ముంది ఈ గండం గడిచేక తనో వుద్యోగం చూసుకుని మాధవిని పెళ్లాడ తానని వాగ్దానంచేసి అందాకా అజ్ఞాతంగా అక్కడ వుండమని చెప్పి కావల్సిన డబ్బిచ్చి వెళ్ళేడుట.

త్రి - మరెందుకు పెళ్ళాడలేదూ?

శే - అతను ఏవో గవర్నమెంట్ రికార్డులు తెలుగులో రాయడానికి కాంట్రాక్టుకి ఒప్పుకుని హైద్రాబాద్ వెళ్ళి మూడు నెలలు అతీ గతీలేదు. ఈలోగా పెళ్ళికి స్వస్తిచెప్పి మురళి దగ్గిర్నుంచి వుత్తరం రాగానే, ఆ భావకవి తిరిగొచ్చిన వారంరోజుల్లో, ఎవరికీ చెప్పకుండా ఉడాయించింది.

త్రివిక్రమరావు యీ కథ విని తెల్లబోయేడు. ఆ భావకవి ఎవరో కాదు, అకోరా అయివుండాలి. తనపెళ్ళి నిశ్చయమైనదనీ తనకో వుద్యోగం కావాలనీ అందాకా హైద్రబాద్‌లో పంచవర్ష ప్రణాళికా పథకం తర్జుమా చేసే

కాంట్రాక్టు దొరికిందని ఐదేళ్ళక్రితం మెడ్రాస్‌వచ్చి అకోరాతనకి చెప్పేడు. అకోరా హైద్రాబాద్ నుంచి తిరిగి వచ్చేక మంచి వుద్యోగం చూపెడితే అక్కర్లేదనీ, పెళ్ళిప్రయత్నంకూడా విరమించినట్టూ చెప్పి వెళ్ళిపోయాడు. దీనికి కారణం త్రివిక్రమరావుకు యిప్పు డర్థమయ్యింది. అకోరా వ్రాసిన 'పతిత వ్రత'లో తను చదివిన భాగం కేవలం కల్పితంకాదనీ ఆ రాధే యీ మాధవనీ ఆ చంద్రమే యీ శేఖర్ అనీ గ్రహించేడు. త్రివిక్రమరావు ఏదో ఆలోచనలో పడ్డట్టు చూసి "ఏరా ఏమిటాలోచిస్తున్నావు" అంటూ పలకరించేడు శేఖర్.

త్రి :- మొత్తంమీద ఆ రెండు నెలల్లోనూ మాధవిని నీ ప్రణయ రంగంలోకీడ్చి వాళ్ళిద్దరికీ పెళ్ళికాకుండా అడ్డం పడ్డావన్నమాట.

శే :- ఏడిశావ్. ఆ మాటకొస్తే వాణ్ణి పెళ్ళాడమని నచ్చచెబుతూ వుత్తరం కూడా రాశాను.

త్రి :- అవును, నీ ప్రేమలేఖలు పట్టుగొచ్చి నీ బండారం బయటపెట్టి నిన్ను ప్రాధేయపడి అడిగేడు కనక.

శే :- గుడ్‌గాడ్ ! ఇదంతా నీకెలా తెలిసిందిరా ! నీకేమైనా కర్ణపిశాచం వుందా !

త్రి - ఆ భావకవే పిశాచమై నాకు చెప్పేడు.

శే :- కాని ఒకవిషయం నిజం. ఒక వేళ వాళ్ళు పెళ్ళిచేసుకున్నా వాళ్ళు సుఖపడి వుండరు. పెళ్ళాడిన తర్వాతయినా మాధవి అతన్ని దగాచేసి వుండేది.

త్రి - ఏం ! మాధవి అతన్ని ప్రేమించలేదా ?

శే -మాధవికి ప్రేమంటే ఆ రోజుల్లో తెలీదు. తెలిసిందల్లా సినిమాల్లో నటించి పెద్దతారవ్వాలనీ, బోలెడుడబ్బు సంపాదించాలనీ పట్టుదల. కాని నిజం చెప్పవల్సివస్తే మాధవి ప్రపంచంలో ఎవర్నైనా మనసారా ప్రేమించివుంటే ఆ కవినే ప్రేమించింది.

త్రి - నీకెలా తెలుసు ?

శే. సినిమాతారయిన తర్వాత మళ్ళీ మాధవిని కలుసుకోవడం మొదలెట్టేను. చాలాసార్లు అతనికి డబ్బు పంపించిందిట. అతను తిరగ్గొట్టేవాడుట. అతనికి క్షయరోగం వచ్చిందని తెలిసి ఎంతో ఏడ్చింది. ఇక్కడకి తీసుగొచ్చి నాదగ్గిర వైద్యం చేయిస్తానన్నది. అతను నిరాకరించేడు. నెల్లాళ్ళక్రితం ఓరోజున నా దగ్గిరకొచ్చి అతన్ని పెళ్ళాడటానికి నిశ్చయించుకున్నట్టు చెప్పింది. అలా వుత్తరం రాస్తానన్నది. అతనికోసం ఎలాటిత్యాగమైనా చేస్తానన్నది. మాధవి ఉద్రేకం నాకు కొత్తకాదు. రాసే వుంటుంది కూడాను.

"మొన్న విజయవాడెందు కెళ్ళిందో చెప్పిందా ?"

''లేదు.''

''పోనీ తిరిగొచ్చేక చెప్పలేదా ?''


''లేదు.''

అంతవరకూ తమ రహస్యాన్ని కాపాడినందుకు త్రివిక్రమరావు మాధవిని మనస్సులోనే అభినందించు కున్నాడు.

* * *

త్రివిక్రమరావుకి, అకోరా 'పతితవ్రత' నవల నెలా అంతం చేశాడో చదవాలని కుతూహలంతో ఆఖరి పేజీ తిరిగేశాడు. అందులో యిలా వుంది...

రాత్రి రోడ్డు నిర్జనంగా వుండటంవల్ల స్టీరింగ్ మీద ఓ చెయ్యి తలుపు మీద ఓ చెయ్యివుంచి రాధ కారుని శరవేగంతో పోనిస్తున్నది. మొహంలో గాంభీర్యం నిశ్చయం ప్రస్ఫుటంగా కనబడు



తున్నాయి. మనస్సులో చెలరేగే భావో ద్రేకాలు కారు వేగంలో వ్యక్తపరుస్తూంది. అతను రాసిన ఆఖరి వుత్తరంలో వున్న మాటలు కత్తుల పాదాలతో ఆమె హృదయంలో నృత్యం చేస్తున్నాయి

''శిధిలమైన హృదయం–ప్రాణానికి వాసయోగ్యం కాని క్షీణించిన శరీరం తోటీ జీవచ్ఛవంగా వున్న నన్ను పెళ్లాడి ఏం సుఖపడతావు !

''ఐదేళ్ళ క్రితం దెబ్బతిన్న చిన్న పావురాన్ని చేరదీసి నా హృదయ పంజరంలో ఆశ్రయ మిచ్చేను. సుఖపడి సుఖపెడుతుందని ఆశించేను పంజరం నుంచి తప్పించుకు పారిపోయింది ఐదేళ్ళ స్వైర విహారం తర్వాత మళ్ళీ ఆ పావురాన్ని పంజరంలో బంధిస్తే సుఖపడుతుందని భ్రమపడేటంతటి అవివేకిని గాను. నా మీద నీకున్న జాలికి కృతజ్ఞుణ్ణి.

''నేను సజీవంగా వున్నన్నాళ్ళూ నీ నేరం నిన్ను బాధిస్తూనే వుంటుంది. నేను జీవించి ఎటూ సుఖపడే దేమీ లేదు. నా మరణంవల్ల నువ్వేనా సుఖపడతావన్న నమ్మకంతో ఆత్మహత్య చేసుకుంటున్నాను.

"నేను చచ్చిపోయిన తర్వాత నువ్వు నాకు వ్రాసిన వుత్తరాలు ఎవరి చేతులో నైనా పడితే నీ కీర్తి ప్రతిష్ఠలకి భంగం. అంచేత అవికూడా ఇందులో జతపర్చి పంపించేస్తున్నాను..."

రాధ కన్నులు చెమ్మగిల్లేయి. కారు వేగం హెచ్చింది. కన్నీటి తెరలోంచి రోడ్డు సరిగ్గా కనబడటం లేదు. ఎదురుగా మరో కారు వొస్తుంది. మధ్య అస్పష్టంగా వంతెన కనబడింది. తన మనో నిశ్చయాన్ని కార్యరూపంలో పెట్టవల్సిన క్షణం అదే తన జీవితాని కదే ఆఖరు ఘడియ. తర్వాత అనంతమైన అంధకారం. రాధకి మెదడూ, కాళ్ళూ, చేతులూ స్వాధీనం తప్పేయి. ఏం చేసిందో తనకే తెలీదు.

ఎదురుగుండా వస్తున్న కారులోంచి దిగింది షూటింగ్‌నుండి తిరిగి వస్తున్న ఏక్టర్ డైరెక్టర్ ప్రొడ్యూసర్ సారధి. వంతెన మధ్యగా అడ్డం తిరిగి ఆగిపోయిన కారు వైపు ఆతృతగా పరిగెత్తేడు. అది రాధ కారని ఆనవాలు పట్టిన క్షణంనుంచీ మరింత ఖంగారెక్కువయ్యింది.

సారధి యిచ్చిన బ్రాంది తాగి రాధ తేరుకుంది. ఇటువంటి భయంకర నిరాశా దుర్ముహూర్తం నుంచి కాపాడినందుకు కృతజ్ఞతతో రాధ సారధి వొళ్ళో వాలిపోయింది.

అంతే.

* * *

సత్యాని కంత దగ్గిరగా ఊహించ కలిగిన అకోరా మేధాశక్తికి త్రివిక్రమ




రావు జోహార్లర్పించేడు. త్రివిక్రమ రావును వెంటాడుతున్న సందేహానికి కూడా అందులోనే సమాధానం దొరికింది. మాధవి, అకోరాకు రాసిన వుత్తరాలు తన చేతుల్లో పడివుంటే తస్కరించుకు పోదామన్న పన్నాగంతో మాధవి, తనని విజయవాడలో కలుసుకుంది ఈ ప్రమా దాన్ని ముందే ఊహించి అకోరా మాధవి రాసిన వుత్తరాలన్నీ మెడ్రాస్ ఎడ్రస్‌కి మాధవికి పంపించేసి వుంటాడు. విజయ వాడ నుంచి తెచ్చిన కాగితాల కట్ట, తనకి నిద్రపట్టిన తర్వాత డైరెక్టర్ మురళీ కృష్ణ సహాయంతో వెతిగి వుంటారు. ఉత్తరాలు లేక నిస్పృహతో మద్రాస్ వెళ్ళేటప్పటికి అకోరా పంపిన ఉత్తరాలు మాధవికిఅందిఉంటాయి.పశ్చాత్తాపంతో, ఉద్రేకంలో ఆత్మహత్యకి ప్రయత్నించి వుంటుందని గ్రహించేడు.

పతితవ్రత కేవలం కల్పితకథ కాదనీ అది అకోరా అమర ప్రేమగాథనీ తెలుసుకున్నాడు.

★